సాక్షి సంగారెడ్డి

ఆదివారం ׀ 18 ׀ ఫిబ్రవరి ׀ 2024



శ్రీకారం దిద్దుకుంది పెళ్లి పుస్తకం.. ఇక ఆకారం దాల్చనుంది కొత్త జీవితం.. అంటూ సాగిన అలనాటి సాంప్రదాయ కల్యాణ వేడుకలు మళ్లీ నేటి తరం అనుసరిస్తోంది. మొదట సెలబ్రెటీలు, ఉన్నత వర్గాలు మొదలుపెట్టినా.. ఇప్పుడు మధ్యతరగతిలోకి కూడా పాకింది. అందుకు ఎన్నో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు కూడా ఉనికిలోకి వచ్చాయి. నేటి యువత ఐదురోజుల పెళ్లి ముచ్చటను సందడిగా చేసుకోడానికి ఆసక్తి చూపుతోంది. దానిపై ప్రత్యేక కథనం..

గోరింటాకుతో మహిళలు





పెళ్లికూతురికి పాలాభిషేకం

5 రోజుల పెళ్లిముచ్చట

పాత సంప్రదాయాలకు పెద్దపీట

సండే స్పెషల్

- ఆసక్తి చూపుతున్న యువత
- పట్టణాల నుంచి పల్లెకు..
- ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లకూ డిమాండ్

జగదేవ్‌పూర్(గజ్వేల్):

పెళ్లంటే జీవితంలో ఒక్కసారి జరిగే మధుర ఘట్టం. ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయే తీపి జ్ఞాపకం. అందుకే పెళ్లిని గతంలో ఐదు రోజుల పాటు సందడిగా జరుపుకునే వారు. రానురాను ఆ సందడి మాయమైంది. ఇప్పుడు ఉదయం పెళ్లి జరిగితే సాయంత్రానికి సందడంతా ముగిసిపోతుంది. చుట్టాలు కూడా వచ్చి కనిపించి వెళ్లిపోతున్నారు. అయితే ఇప్పుడిప్పుడే మళ్లీ ట్రెండ్ మారుతోంది. ఆనాటి ఆచారాలకు పెద్దపీట వేస్తున్నారు. చాలా ఇళ్లల్లో ఐదు రోజుల పెళ్లి సందడి ఇప్పటికే మొదలైంది. మెహందీ ఫంక్షన్‌తో మొదలై రకరకాల కార్యక్రమాలతో సంతోషంగా గడుపుతున్నారు.

ఐదు రోజుల పెళ్లి ఇలా....

మొదటి రోజు సంగీత్

◆ ఇది పెళ్లి కూతురు ఇంటి వద్ద జరుగుతుంది. మర్నాడు అమ్మాయి మరో కుటుంబంలోకి వెళ్లిపోతుంది. కాబట్టి కుటుంబంతో ఒకరోజు ఆడిపాడుతుంది. రాజుల కాలంలో కచేరి నిర్వహించేవారు. ప్రస్తుతం అమ్మాయి కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు ఆనందంగా డ్యాన్స్‌లు చేస్తున్నారు. దీనికి వరుడి కుటుంబ సభ్యులను కూడా ఆహ్వానిస్తారు. అంతా కలిసి పరిచయ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు.

2వరోజు మెహందీ

◆ గతంలో పెళ్లికి ముందు ఇంట్లో వారే పెళ్లి కూతురికి గోరింటాకు పెట్టేవారు. ప్రస్తుతం ఇది కూడా సంబురంగా నిర్వహిస్తున్నారు. ఇంట్లో ప్రత్యేక సెట్ వేసి మెహందీ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. పెళ్లి కూతురితోపాటు బంధువుల మహిళలు గోరింటాకు పెట్టుకుంటున్నారు.

3వ రోజు హల్దీ..

◆ పెళ్లి కూతురికి పసుపు రాయడం ఎప్పుడూ ఉండేదే. అయితే అమ్మాయి అబ్బాయి ఇళ్లలోనూ దీనికి హల్దీ పేరిట మంగళస్నాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనికి కూడా భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసి హడావుడి చేస్తున్నారు.

4వ రోజు వివాహం

◆ వివాహ ఘట్టంలో సంప్రదాయంగా వాడే వస్తువులకు ప్రత్యేక డిజైన్లు వేస్తున్నారు. వరుడిని గుర్రంపై మండపం వరకు, ఆ తర్వాత ముత్యాల పందిరితో స్టేజీపైకి తీసుకొని వస్తున్నారు. వధువును బుట్టలో కూర్చోబెట్టి మోసుకుని తీసుకువస్తున్నారు. అంత్యంత సాంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహిస్తున్నారు.

5వ రోజు వ్రతం, రిసెప్షన్

◆ చివరిగా వ్రతంతో పెళ్లి వేడుక ముగుస్తుంది. వ్రతాలకు అవసరమయ్యే వస్తువులను కూడా ఈవెంట్స్ ఆర్గనైజర్లే సమకూరుస్తున్నారు. పెళ్లి కంటే ఆర్భాటంగా రిసెప్షన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పోటీపడి ఒకే రకమైన దుస్తులు ధరిస్తున్నారు.

మేళతాళాల్లోను స్పెషల్

◆ వివాహాలకు సన్నాయి బృందాలు సాధారణ బ్యాండు వహించడం ఇప్పటి వరకు ఉన్న ఆనవాయితీ. ప్రస్తుతం ఇందులోనూ కొత్తట్రెండ్ వచ్చింది. కేరళ డోలు వాయిద్యం, పంజాబీ బ్యాండ్ లాంటివాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పెళ్లి ముందు జరిగే వేడుకల్లో కొన్ని సామాజిక వర్గాల ఆచారాల ప్రకారం అదనపు కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. ప్రతి కార్యక్రమానికి ఒక డ్రెస్ కోడ్ పెడుతున్నారు.





పెళ్లి కూతురికి మంగళస్నానం చేయిస్తున్న దృశ్యం

అభిరుచికి తగ్గట్టు ఏర్పాట్లు

అన్ని కార్యక్రమాల నిర్వహణకు నేడు ఈ వెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. సంప్రదాయాలను పాటించాలనే ఆసక్తి ఉన్నవారికి ఈ సంస్థలు అన్నీ సమకూర్చి పెళ్లికి నిండుదనాన్ని తీసుకు వస్తున్నాయి. బాజాభజంత్రీలు, వధూవరుల ముస్తాబు, ఫంక్షన్ హాల్, డెకరేషన్, విందు, వినోదానికి అన్ని ఏర్పాట్లకు ఈ సంస్థలే బాధ్యత వహిస్తున్నాయి. నగరాలకే పరిమితమైన ఈవెంట్ 'మేనేజ్‌మెంట్' చిన్న పట్టణాలకు. పల్లెలకు కూడా విస్తరించింది. సెలబ్రిటీలు, వ్యాపారవేత్తల ఇళ్లలో జరిగే ఐదు రోజుల పెళ్లిపై ఇప్పుడు మధ్య తరగతి కుటుంబాలు కూడా ఆసక్తి చూపుతున్నాయి.

కొత్త హంగులతో పెళ్లి పందిళ్లు



దుబ్బాకరూరల్:

ఒక్కప్పుడు పెళ్లంటే ప్రతి ఇంట్లో పండగ వాతావరణంలా ఉండేది. పెళ్లికి పదిహేను రోజుల ముందు నుంచి ప్రతిఇల్లు బంధువులు, స్నేహితులతో నిండిపోయేది. ఇళ్లంతా పండగ వాతావరణం తలపించేది. కొబ్బరాకులతో పందిళ్లు, మామిడాకులతో పచ్చతోరణాలు కట్టేవారు. అలాగే సన్నాయి మేళాలు, బ్యాండ్ చప్పుళ్లు, ఊరేగింపులతో ఉత్సాహంగా గడిపేవారు. పెండ్లి పత్రికలు ముద్రించి చుట్టాలకు, స్నేహితులకు బస్సుల మీద, సైకిళ్లపైనా స్వయంగావెళ్లి పంచేవారు. అరటి, విస్తరాకుల్లో భోజనాలు వడ్డించేవారు. పెళ్లయ్యాక బంధువులు, స్నేహితులు వారం రోజుల వరకు ఇంటివద్దే ఉండి సందడిచేసేవారు. అయితే ఇప్పుడు అన్నింటిలోను ఆధునికత వచ్చిచేరింది. రంగురంగుల డిజైన్లతో ఎక్కువ ఖరీదైన శుభలేఖలు ముద్రిస్తున్నారు. నిశ్చితార్థం, పెళ్లికి పిలుపులకు 'ఇన్విటేషన్'పేరుతో వీడియోచేసి వాట్సాప్‌లో పంపిస్తున్నారు. పందిరి వేయడానికి ప్లాస్టిక్ పూలు, వస్తువులతో ముత్యాల పందిరి వేస్తున్నారు. పెద్ద పెద్ద ఫంక్షన్‌హాల్‌లో పెళ్లిళ్లు చేస్తున్నారు. సంగీత్, మెహందీ, ఊరేగింపులకు డీజే సౌండ్‌తో అదరగొడుతున్నారు. భోజనాలు ఏర్పాట్లలోను చాలా పద్ధతులు వచ్చాయి. బఫే పద్ధతిలో నిలబడి భోజనాలు చేస్తున్నారు. ఇప్పుడు ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లలో వడ్డిస్తున్నారు. మంచినీళ్లకు వాటర్ బాటిళ్లు వాడడం సంప్రదాయంగా మారింది. పెళ్లి కార్యక్రమం అయిపోయాక బంధువులు, స్నేహితులు వెంటనే వెళ్లిపోతున్నారు. పెళ్లి తంతులో చాలా వరకు ఫోన్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

డీజే.. మస్తు మజా

- నాడు బాజాలు.. నేడు డీజేలు
- ఫాస్ట్‌బీట్‌తో కుర్రకారు జోష్



పెళ్లి పందిరి డెకరేషన్

డీజేనే వాడుతుండ్రు



అప్పుడు పెళ్లిళ్లకు ఎక్కువగా బ్యాండ్‌నే వాడేవారు. పెళ్లికి సంబంధించి చాలా సందర్భాల్లో డీజేనే వాడుతుండ్రు. కొత్త పాటలకు డ్యాన్స్‌లు చేస్తుండ్రు. దీనివల్ల మాకు ఉపాధి తగ్గింది. పెండ్లిలప్పుడే మాకు పని ఉంటుంది. తర్వాత మాకు పని ఉండదు. దీంతో కుటుంబపోషణ భారంగా మారింది. ప్రభుత్వం జీవన భృతి ఇస్తే బాగుండు.

– ఎండీ.షబ్బీర్‌మియా, బ్యాండ్ గ్రూపు లీడర్

డీజే సౌండ్‌తోనే థ్రిల్లనిపిస్తుంది



పెళ్లిళ్లకు ఇప్పుడందరూ ఎక్కువగా డీజే సౌండ్‌నే వాడుతున్నారు. యూత్ అంతా డీజేకు అలవాటు పడ్డాం. అది లేకపోతే ఏ ఒక్కరికీ థ్రిల్ ఉండదు. కొత్తకొత్త పాటలకు డ్యాన్స్‌లు చేస్తే మస్తు మజా అనిపిస్తుంది.

– శివకుమార్, యువకుడు

న్యూస్‌రీల్

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి టౌన్ : పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలపై శనివారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌తో కలిసి ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని ప్రాథమిక మత్స్య సహకార సంఘాల ఓటరు జాబితా విడుదలైందని, అభ్యంతరాలు ఉంటే ఈనెల 19 వరకు స్వీకరిస్తారని జిల్లా మత్స్య సహకార శాఖ అధికారి సతీష్ తెలిపారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నామన్నారు. శనివారం ఓటరు జాబితా జిల్లా మత్స్యశాఖ అధికారి, అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. అభ్యంతరాలను గడువు తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

కూలీల సంఖ్య పెంచండి

డీఆర్‌డీఓ జ్యోతి



సిబ్బందితో మాట్లాడుతున్న జ్యోతి

కంది(సంగారెడ్డి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీల సంఖ్య తగ్గితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ జ్యోతి సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధి హామీ పథకం అమలవుతున్న తీరును పరిశీలించారు. మండలంలో 22 గ్రామాలుండగా 11 గ్రామాల్లో మాత్రమే పనికి కూలీలు వస్తున్నారన్నారు. మిగతా వారు అనాసక్తి చూపిస్తున్నారని ఏపీఓ గురుపాదం తెలిపారు. కూలీలకు పథకంపై అవగాహన కల్పించి వారి సంఖ్య పెంచకుండా ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తీరు మారకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఈ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 5వ స్థానంలో ఉన్న సంగారెడ్డి జిల్లాను తొలి స్థానంలో తీసుకు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో పటాన్ చెరు, జిన్నారం, గుమ్మడిదల, కల్హేర్, కంది మండలాలు కూలీల సంఖ్య పెంచడంలో వెనుకబడామన్నారు. పనిప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. 100 రోజులు పని పూర్తి చేసుకునేలా సహాయ సహకారాలను అందజేయాలన్నారు. వేతనాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలు సరిగ్గా పెంచడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం సహించం

ఉద్యోగులకు డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి స్పష్టీకరణ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సంగారెడ్డి

జోగిపేట(అందోల్): వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే సహించబోమని సిబ్బందిని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి హెచ్చరించారు. శనివారం జోగిపేట ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన సమావేశంలో నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ సొంత నియోజకవర్గం అందోల్ కాబట్టి ఇక్కడ పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది రెగ్యులర్‌గా విధులకు హాజరు కావాలన్నారు. కాయకల్ప, లక్ష్య, ముస్కాన్ కార్యక్రమాల అమలు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆస్పత్రిని త్వరలో ఎంక్వస్ (ఎన్‌క్యూఏఎస్) సెంట్రల్ టీం విజిట్ చేస్తుందన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ రమేష్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీగా వెంకటరమణ నియామకం

వెంటనే బాధ్యతల స్వీకరణ



డీటీసీని కలిసిన శాఖ ఉన్నతాధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)గా డాక్టర్ వెంకటరమణ నియమితులు కావడం ఆపై బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. ఇక్కడ డీటీసీగా పనిచేసిన శివలింగయ్య మహబూబ్‌నగర్ డీటీసీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నిజామాబాద్ డీటీసీగా పనిచేసిన వెంటక రమణ నియమితులయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వివిధ శాఖల అధికారులకు స్థాన చలనం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తున్న విషయం విదితమే. సంగారెడ్డితో పాటు మెదక్, సిద్దిపేట జిల్లాలు కూడా ఈ డీటీసీ పరిధిలోనే ఉంటాయి.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో నివాసముండే అమృతరావు అలియాస్ వాసు.. మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13న ఇస్నాపూర్ కల్లు దుకాణం వద్ద గొడవ జరుగుతుందని తన కుమారుడు చింటూకు ఫోన్ చేశాడు. వెంటనే అక్కడికి చేరుకోగా ఎవరూ కనిపించలేదు. తండ్రికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి కోసం తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు శనివారం పోలీసులను ఆశ్రయించాడు. వారు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ



మంత్రి దామోదరను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళ నేతలు

జోగిపేట(అందోల్): జోగిపేట–అజ్జమర్రి మధ్య వంతెనల నిర్మాణం కోసం రూ.80 కోట్లు మంజూరు చేయించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జోగిపేటలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. బైపాస్ నిర్మాణంతో జోగిపేటలో 40 శాతం వ్యాపారం తగ్గిపోయిందన్నారు. ఆలోటును పూడ్చి పూర్వ వైభవం తెచ్చేందుకు ఏంచేస్తే బాగుంటుందో చెప్పాలని వ్యాపారస్తులను కోరారు. వంతెన నిర్మిస్తే సుమారుగా 40 గ్రామాల ప్రజలు జోగిపేటకు వివిధ పనుల నిమిత్తం వచ్చే అవకాశం ఉందన్నారు. తనకు ఎవరూ ఈ బ్రిడ్జి కట్టాలని చెప్పలేదన్నారు. తన తండ్రి రాజనర్సింహకు వ్యాపారులతో సత్సంబంధాలు ఉండేవని, తనపై మాత్రం ఎందుకో కోపంగా ఉన్నారని చలోక్తి విసిరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాత్రం అండగా నిలిచారన్నారు. అందుకు రుణపడి ఉంటానన్నారు. అందోల్ శివారులోని 1,141 సర్వే నంబర్‌లో ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నర్సింగ్ కళాశాల, హాస్టల్, 150 పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని ప్రకటించారు. జోగిపేట నుంచి అందోల్ వరకు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. జోగిపేట ఆర్యవైశ్య భవన అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఈ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, డీటీ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్ రంగ సురేష్, ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గోలి పద్మ, సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు డీజీ వెంకటేశం, పలువురు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు తోడ్పాటు అందించాలి

సంగారెడ్డి టౌన్ : సమాజాభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు తోడ్పాటు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం కలెక్టరేట్లో సీఎస్ఆర్ నిధుల సేకరణపై అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య సదుపాయాల కోసం ఖర్చు చేస్తామన్నారు. ముఖ్యంగా హాస్టల్స్, ఆస్పత్రులు, అదనపు తరగతి గదులు, విద్యాసంస్థలకు కావలసిన ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ కోసం వినియోగించేలా చూడాలన్నారు. జిల్లాలోని ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ఇవ్వాల్సిన బకాయిలపై దృష్టి సారించాలన్నారు.

క్లుప్తంగా

మరణంలోనూ వీడని బంధం



ఎల్లయ్య, లచ్చవ్వ దంపతులు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): తోడూ నీడై నిలిచిన భార్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె మరణాన్ని తట్టుకోలేక కలత చెందిన భర్త సైతం తనువు చాలించాడు. ఈ విషాదకర ఘటన అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బైరగోని ఎల్లయ్య(85) భార్య లచ్చవ్వ(80) అనారోగ్యానికి గురై చికిత్స కోసం ఆసుపత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొంది ఇంటికి చేరింది. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. కలత చెందిన భర్త ఆమె మృతిని తట్టుకోలేక భార్య అంత్యక్రియలు చేసి ఇంటికి వచ్చేసరికి మృతి చెందాడు. ఇది చూసిన బంధువులు, గ్రామస్తులు మరణంలోనూ వీరి బంధం వీడలేదని కంటతడి పెట్టుకున్నారు. భార్యాభర్తల మరణంతో ఊరంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

ఇంటికి నీళ్లు పడుతుండగా..

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


సురేందర్ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొండాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్ర మోహన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల సురేందర్(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. రోజులాగే శుక్రవారం రాత్రి క్యూరింగ్ కోసం ఇంటికి నీళ్లు పడుతుండగా కరెంట్ తీగలు తెగి కిందపడ్డాయి. సురేందర్ తడిచి ఉండడం వల్ల షాక్‌తో కింద పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య మహేశ్వరి, ఆరు నెలల కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాబోయ్ పేలుళ్లు..

- నివారించడంలో అధికారులు విఫలం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కంకర క్రషర్లు
- బీటలు వారుతున్న ఇళ్లు
- ఆందోళనలో చుట్టుపక్కల గ్రామస్తులు

బాంబు పేలుళ్లు.. గుండెలదిరేలా, చెవులు చిల్లులు పడేలా శబ్దాలు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రి సమయంలో బ్లాస్టింగ్‌లు నిత్యకృత్యంగా మారడంతో చిన్నా పెద్దా తేడా లేకుండా వణికిపోతున్నారు. అనుమతులు లేకుండా కంకర క్రషర్ల యజమానులు పేలుళ్లు జరుపుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

–జిన్నారం(పటాన్‌చెరు)


ఖాజీపల్లిలోని ఓ కంకర క్రషర్

జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, బొల్లారం, శివానగర్, రాళ్లకత్వ, దాదిగూడెం, మాదారం గ్రామాల పరిధిలో సుమారు 50 కంకర క్రషర్‌లు ఉన్నాయి. కంకర క్రషర్‌ల యాజమాన్యాలు నిబంధనలు పక్కన పెట్టి వ్యాపారాన్ని అక్రమంగా నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో బ్లాస్టింగ్‌లను జరుపుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు సైతం ఉలిక్కిపడుతున్నారు. ఈ బ్లాస్టింగ్‌లతో శివారు గ్రామాల్లోని ఇళ్లు బీటలు వారుతున్నాయి. బ్లాస్టింగ్‌లు జరిగిన సమయంలో ఇంటి పైకప్పు నుంచి మట్టి రాలుతుందంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖాజీపల్లి, దాదిగూడ, మాదారం తదితర గ్రామాల్లోని 50శాతానికి పైగా ఇళ్లు బీటలు వారినవే కనబడుతాయి. కేవలం వ్యవసాయంపై ఆధారపడే రైతు కుటుంబాలు ఈ గ్రామాల్లో ఎక్కువగా ఉంటారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు సైతం బీటలు వారుతుంటే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాదారంలోని ఇంటికి పగుళ్లు

పంట పొలాల్లో రాళ్లు..

మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని మంత్రికుంటలో శివారులో బ్లాస్టింగ్‌లు జరుపుతుండడంతో రాళ్లు పంట పొల్లాల్లోకి వచ్చి పడుతున్నాయి. తాము వ్యవసాయ పనులు జరిపేందుకు జంకుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, సంబంధిత మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు కంకర క్రషర్‌ల యాజమాన్యాలతో కుమ్మక్కై బ్లాస్టింగ్‌ల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బ్లాస్టింగ్‌లు జరిపిన సమయంలో ఒక్కసారిగా దుమ్ము గ్రామాలను కప్పేస్తోంది. ఈ దుమ్మును పీల్చుకుంటున్న ప్రజలు, చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. కంకర క్రషర్‌లల్లో జరుగుతున్న బ్లాస్టింగ్‌లను నివారించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

బ్లాస్టింగ్‌ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాటి నుంచి వచ్చే దుమ్ము గ్రామాన్ని పూర్తిగా కమ్మేస్తుంది. పంట పొలాల్లోకి రాళ్లు పడుతుండడంతో వ్యవసాయం చేసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశాం.

–విజయ్, మాదారం

చర్యలు చేపడుతాం

బ్లాస్టింగ్‌లు జరుగుతున్న విషయం తమ దృష్టికి వస్తున్నాయి. బ్లాస్టింగ్ జరిపే సమయంలో తగిన నిబంధనలను పాటించాలని యాజమాన్యాలను సూచనలు చేస్తున్నాం. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడుతాం.

–భిక్షపతి. తహసీల్దార్, జిన్నారం

తాళం వేసిన ఇళ్లలో చోరీ

నగదు, బంగారం అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కేశవులు

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చిన్న ఘనాపూర్ గ్రామంలో శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటపురం బాలయ్య ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు ట్రంకు పెట్టెలో దాచిన రూ.1.50 లక్షల నగదు, అర తులం బంగారం, 30 తులాల వెండి ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీనారాయణ ఇంట్లోకి చొరబబడి బీరువాలో దాచిన రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. చోరీ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ కేశవులు, ఎస్‌ఐ గౌస్ గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడ్డ దొంగలు నగదు,వస్తువులు ఉన్న ఖాళీ ట్రంకు పెట్టెను, ఇతర వస్తువులను గ్రామ శివారులోని వ్యవసాయ పొలంల వద్ద వదిలి వెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడిళ్లలో..

తూప్రాన్: మండలంలోని వెంకటాయిపల్లిలో మూడిళ్లలో చోరీ జరిగిన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నలంబ మహేశ్ ఇంటికి తాళం వేసి గ్రామంలోని బంధువుల వద్ద ఉన్నాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిపెట్టిన తులంన్నర బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. అలాగే శీలదారి సత్యనారాయణగౌడ్ ఉద్యోగ రీత్యా మనోహరాబాద్ మండలంలో నివసిస్తున్నాడు. గ్రామంలో డ్వాక్రా గ్రూపులో తీసుకున్న రుణం చెల్లించేందుకు గ్రామానికి వచ్చాడు. కానీ సభ్యులు లేకపోవడంతో ఇంట్లోనే దాచిపెట్టి వెళ్లాడు. ఉదయం వచ్చే సరికి దాచిన నగదు రూ. 5 వేలు తాళం పగులగొట్టి దోచుకెళ్లారు. అలాగే కిష్టారాం పెంటయ్య ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు పగులగొట్టారు. ఏమీ లభించకపోవడంతో ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి వెళ్లారు. ఉదయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

ఉచిత ఐటీ సేవలు


ఐటీ చేసుకుంటున్న ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఐటీ సేవలు విజయవంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల సంబంధించి 2023 –24 సంవత్సరానికి గాను ఐటీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు 250 మంది ఉపాధ్యాయులకు సంబంధించి ఉచితంగా ఐటీ చేశామన్నారు. కార్యక్రమంలో ఐటీ సేవ నిర్వాహకులు రాఘవేందర్, నందరాం రఘుబాబు, రామకృష్ణ, సుభాష్ రెడ్డి, తాళ్ల శ్రీనివాస్, షిరిగే చంద్రశేఖర్, ఎల్. మల్లారెడ్డి, ఇమ్మడి సంతోష్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో..

- సమయస్ఫూర్తి ప్రదర్శించాలి
- అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్


సదస్సులో అధికారులు, పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తిని ప్రదర్శించాలని మెదక్ అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విపత్తు నిర్వహణ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలైన తుఫాన్, పిడుగు పాటు, వడగళ్ల వాన, భూకంపం మరేదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి విపత్కర ఘటనలు ఎదురైనప్పుడే సీపీఆర్ చేసి చివరి క్షణాల్లోనూ ప్రాణాలను కాపాడొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్డీఎస్పీ రంగా నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గణపతి, లెక్చరర్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ బల్వంత్‌రావు

- చేసే వృత్తి హిందీ పండిట్
- భాషపై విద్యార్థులు ఇబ్బంది పడకూడదని 'సుభోద్ హిందీ వ్యాకరణం' ఆవిష్కరణ
- మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీకి ప్రోత్సాహం


మార్చ్‌పాస్ట్‌లో విద్యార్థులతో బస్వంత్‌రావు (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ ఇంకా ఏదైనా సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తూ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని తిరుమలాపూర్ మోడల్ స్కూల్ (ఆదర్శ) హిందీ పండిట్ కంఠాల బల్వంత్‌రావు. పదేళ్లుగా హిందీ పండిట్‌గా ఇదే పాఠశాలలో తన సేవలు అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని మారుమూల గ్రామమైన సుక్కల తీర్థంలో జన్మించిన ఈయన ప్రైవేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే 2014లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పెద్దశంకరంపేటలో నియమితులయ్యారు.

హిందీ సుభోద్ వ్యాకరణంతో..

తాను చదువుకునే సమయంలో హిందీ భాషపై జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడొద్దని ఆలోంచారు. ఇందుకోసం ఎంతో కష్టపడి 'సుభోద్ హిందీ వ్యాకరణం' అనే పుస్తకాన్ని రచించి జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా అప్పటి జిల్లా విద్యాధికారి రమేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. దీని వల్ల ప్రతీఏటా హిందీలో ఎస్సెస్సీలో శతశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేశారు.

విద్యార్థులతో 'మార్చ్ పాస్ట్'..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చి దిద్దాలనే లక్ష్యంతో తాను నేర్చుకున్న ఎన్‌సీసీని విద్యార్థులకు నేర్పించారు. ఎక్కడా మోడల్‌స్కూల్‌లో లేని మార్చ్‌పాస్ట్ ను తిరుమలాపూర్ మోడల్‌స్కూల్‌లో ప్రారంభించారు. వీటికి కావాల్సిన ఉపకరణాలను సైతం తానే స్వయంగా విద్యార్థులకు ఉచితంగా అందజేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు.

ఉత్తమ పురస్కారాలు ..

కంఠాల బల్వంత్‌రావు చేసిన ఉత్తమ సేవలకు, ఆయన రచనకు 2016లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2019లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2022లో లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు.

అందరి సహకారంతోనే..



తనకు మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందరి సహకారంతోనే లభించింది. హిందీ వ్యాకరణంలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే ఆలోచన, మార్చ్‌పాస్ట్ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాను. మా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతోనే ఇదంతా సాధ్యమవుతోంది.

– బల్వంత్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు

రైతు కష్టం బూడిదపాలు

విద్యుదాఘాతంతో చెరుకు తోట దగ్ధం


పంటను చూపిస్తున్న రైతు

ఝరాసంగం(జహీరాబాద్): చెరుకు పంట దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన జోగు అంజన్న రెండు ఎకరాల విస్తీర్ణంలో చెరుకు పంటను సాగు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో చెరుకు పంట పొలంపై ఉన్న విద్యుత్ తీగలు పడి షార్ట్ సర్క్యూట్ అయింది. సాగులో ఉన్న చెరుకు పంటతోపాటు పొలంలో ఉన్న డ్రిప్పు పైపులు, నీటి పైపులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా రాలేకపోయారని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

పాత కక్షలతోనే హత్య

ముగ్గురు నిందితుల రిమాండ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నిజాంపూర్ గ్రామ శివారులో ఈనెల 14న ఐకేపీ వీఓఏ జలగల్ల బాలరాజ్(40) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ హత్య కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం సీఐ బాలస్వామి తెలిపారు. జలగల్ల బాలరాజ్‌కు నిజాంపూర్ గ్రామానికి చెందిన జలగల్ల రాజు(55), వెంకటాపురం సురేశ్(31), జలగల్ల చంద్రకాంత్(32)లతో ఓ భూమి విషయంలో తగాదాలు జరిగాయి. దీంతో పాత కక్షలను మనస్సులో పెట్టుకొని బాలరాజ్‌ను చంపాలని పథకం వేశారు. గ్రామ శివారులోని పాడుబడ్డ రేకుల షెడ్డు వద్దకు తీసుకెళ్లారు. నిందితుడు జలగల్ల రాజు బాలరాజ్‌కు బాగా మద్యం తాపి స్పృహ కోల్పోయేలా చేశాడు. అనంతరం ఒక బట్టతో బాలరాజ్ గొంతు బిగించి చంపేశారు.

పశువుల గడ్డివాము దహనం

పాడి ఆవు మృతి, మరో 10 గేదెలకు గాయాలు


ఆవు వద్ద రోదిస్తున్న బాధితులు

తూప్రాన్: పశువుల గడ్డివాము దహనం కావడంతో పాడి ఆవు మృతి చెందగా, 10 గేదెలకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి హుస్సేన్‌పూర్ శివారులోని తెట్టేకుంట వద్ద పుల్లే మల్లేశ్ యాదవ్‌కు చెందిన వ్యవసాయ బావి ఉంది. అక్కడ 1,500 మోపుల పశువుల గడ్డివాము ఉండగా, రోజు మాదిరిగానే పక్కనే పశువులను కట్టేశాడు. గుర్తు తెలియని ఆకతాయిలు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోవడమే కాకుండా పక్కన ఉన్న ఆవులకు అంటుకుంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల ఆవు మంటల్లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే 10 గేదెలకు గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న యాజమాని మల్లేశ్‌యాదవ్ కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న బియ్యం

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. శనివారం పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలో బొలెరో వాహనంలో యాదాద్రి భువనగిరి జిల్లా, రాజాపేట మండలం పుట్టగూడెంకు చెందిన బున్యం రాజారాం, వడ్డీల జగదీశ్‌లు పరిసర గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశారు. అనంతరం ఎక్కువ ధరకు రైస్‌మిల్‌లో అమ్మేందుకు తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించాం. ఇందులో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. గ్యాంబ్లింగ్, పేకాట, ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ సమాచారం అందించాలని సూచించారు.

జీవితంపై విరక్తి చెంది..

యువతి ఆత్మహత్య


సుమలత(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్ర మోహన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య, అయిలమ్మ దంపతులు, వీరికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు, కొడుకు వివాహాలు చేయగా, చిన్న కూతురు సుమలత (25) కొద్ది రోజులుగా మూర్ఛవ్యాధితో బాధపడుతుంది. శనివారం తల్లిదండ్రులు ఉపాధి పనులకు వెళ్లగా సుమలత ఇంటి వద్దే ఉంది. పనులు ముగించుకొని ఇంటికిరాగా లోపల తలుపు గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయకపోవడంతో బద్దలుకొట్టి చూడగా సమలత ఉరివేసుకొని కనిపించింది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల వేదిక

- వెలవెలబోతున్న రైతు వేదికలు
- నిర్వహణ లోపంతో నిరుపయోగం
- కనీస వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న వ్యవసాయ అధికారులు



తిగుల్‌లోని రైతు వేదిక భవనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ వ్యవసాయ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలకు శ్రీకారం చుట్టింది. అన్ని సౌకర్యాలతో నిర్మించగా నేడు నిధులు రాక నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. అసౌకర్యాల మధ్య వ్యవసాయ అధికారులు విధులు నిర్వహించాల్సి వస్తుంది. నీటి వసతి లేక కనీస వసతులు కరువై అటు వ్యవసాయ అధికారులు, ఇటు సమావేశాలకు వచ్చే రైతులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ప్రహరీలు లేక పిచ్చిగడ్డి మొలవడంతోపాటు ఈ సాంఘీక కార్యక్రమాలు అడ్డాగా మారుతున్నాయి.

జిల్లాలో 127 రైతు వేదికలు..

ప్రభుత్వం మండలాల వారీగా ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి, గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో వ్యవసాయ అధికారులు ఉండేందుకు, సమావేశాలు నిర్వహించేందుకు రూ.22 లక్షలతో రైతు వేదికలను నిర్మించారు. జిల్లాలో 127 రైతు వేదికలకు రూ.27 కోట్ల 94 లక్షల నిధులు ఖర్చు చేశారు. రైతుల సమావేశాలకు హాల్, రెండు మరుగుదొడ్లు, అధికారుల కోసం గది నిర్మించారు. వ్యవసాయ సమావేశాలను అధికారులు రైతు వేదికల్లోనే నిర్వహిస్తున్నారు.

ఖర్చులకు నిధుల కొరత

జిల్లాలోని రైతు వేదికల్లో చాలా చోట్ల నీటి వసతి లేదు. మరుగుదొడ్ల నిర్వహణ లేక సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ప్రతి రోజూ రైతు వేదికలో విధులు నిర్వహించే ఏఈఓలు అవస్థలు పడుతున్నారు. ప్రతీ రైతు వేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు, సమావేశాల కోసం మైక్ సెట్ వంటి సామగ్రిని ప్రభుత్వం రైతు వేదికలకు అందించింది. ప్రభుత్వం వీటి నిర్వహణ ఖర్చు నిమిత్తం నెలకు రూ. 9 వేలు ఇస్తామని ప్రకటించింది. 2022 ఆగస్టు నుంచి నిధులు రాకపోవడంతో ఏఈఓలు నిర్వహణ ఖర్చులు భరించలేక వదిలేశారు.

నిర్వహణకు నిధులు నెలకు..

పరిశుభ్రతకు	రూ. 3,000
శిక్షణ ఖర్చులకు	రూ. 2,500
స్టేషనరీ, జిరాక్స్‌లకు	రూ. 1,000
విద్యుత్ చార్జీలకు	రూ. 1,000
మరమ్మతులకు	రూ. 1,000
తాగునీటికి	రూ. 500

క్లుప్తంగా

మాకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కొండెంగలకుంట గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): 35 ఏళ్లుగా నివసిస్తున్న తమను ఇళ్ల ఖాళీ చేసి పొమ్మంటున్నారని, తమకు న్యాయం చేయాలని బాధితులు శనివారం చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ జయలక్ష్మికి, ఎంపీడీఓ జనార్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని మైలారం మధిర గ్రామం కొండెంగలకుంటలో 1989లో సర్వే నంబర్ 571, 573లో నాలుగు ఎకరాల పట్టా భూమిని అప్పటి ప్రభుత్వం 30 మంది పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారన్నారు. కాగా ఇటీవల ఆ భూమిని కొందరు రెవెన్యూ రికార్డులలో పేరు మార్చి తమ భూమి అంటూ కోర్టులో కేసులు వేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇళ్ల నిర్మాణాలు కూల్చి వేస్తామని, కొంత ఖాళీగా ఉన్న స్థలాన్ని తమకే కావాలంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారినుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

వైభవంగా కృత్తిక మహోత్సవం



వర్గల్ శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలో శనివారం కృత్తిక నక్షత్ర మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు తెల్లవారుజామున మూలవిరాట్టుకు విశేష అభిషేకం జరిపారు. శ్రీవల్లీ దేవసేన సమేతులైన స్వామివారిని కమనీయంగా అలంకరించారు. అనంతరం భక్తులు సామూహిక లక్ష పుష్పార్చన చేశారు.

పోలీస్ జాగిలానికి అంత్యక్రియలు



జాగిలానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి : పోలీసు శాఖలో విశిష్ట సేవలందించిన జాగిలం రేమో ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూసింది. ఆ మేరకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకుందన్నారు. వీఐపీ సెక్యూరిటీ తదితరాలకు వినియోగించే వారమన్నారు. శాఖకు తరపున పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ తొలగింపు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎర్దనూర్ లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. సర్వే నంబర్ 338లో ప్రభుత్వ భూమి ఉండగా అందులో 5.16 ఎకరాలను 2009లో ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. ఇందులోని 2 ఎకరాల స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారన్న సమాచారం మేరకు ఆర్ఐ రంగయ్య, సర్వేయర్ సంగీతతో కలిసి తహసీల్దార్ విజయలక్ష్మి చేరుకొని తొలగించారు. ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్‌కు చేగుంట ఎంపీపీ రాజీనామా

చేగుంట(తూప్రాన్): చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య సయోధ్య కుదుర్చలేకపోతున్నారని వాపోయారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ వర్గాలుగా విడిపోయి ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. దీంతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు.

త్వరితగతిన విచారణ పూర్తి చేయాలి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సింగూరు టూరిజంకు మహర్దశ

- మంత్రి దామోదర్ ఆదేశాలతో..
- ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించిన రాష్ట్ర టూరిజం ప్రాజెక్టు అధికారులు
- డ్యామ్‌లో ఐలాండ్‌ల అభివృద్ధికి పెద్దపీట



సింగూరు ప్రాజెక్టుపై పర్యటిస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్) : మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం రాష్ట్ర టూరిజం శాఖ ప్రాజెక్టు మేనేజర్ వైఆర్‌కే రాజు, డీఈఈ శ్రీశైలం ప్రాజెక్ట్ పరిసర గ్రామాలను శనివారం పరిశీలించారు. సింగూరు ప్రాజెక్టు వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి మంత్రి చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉన్న సింగూరు, బస్వాపూర్, క్యాసారం గ్రామాల్లోని భూములను పర్యవేక్షించామన్నారు. సింగూరు ప్రాజెక్టు నది గర్భంలోని పడకంటి, క్యాసారం ఐలాండ్‌లను టూరిజం బోటు సాయంతో కలియతిరిగామన్నారు. ప్రాజెక్టు లోపలి భాగంలోని ఐలాండ్‌లని గుట్టల్లో టూరిజంకు అనువైన నిర్మాణాలు చేయడానికి వీలవుతుందా లేదా అని చూశామన్నారు. రాకపోకలకు బోట్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా చేయొచ్చా.. లేదా తనిఖీ చేశామన్నారు. ఈ ప్రాజెక్టు దిగువన ఉన్న కొన్ని టూరిజం పార్కులు గతంలో వరదలతో పాడైపోయాయని, వాటిని మళ్లీ అభివృద్ధి చేయడానికి వీలవుతుందా లేదా అని తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టుకు రెండు కిలోమీటర్ల దూరంలో బస్వాపూర్ శివారులో ఉన్న నీటిపారుదల శాఖ భూములను పర్యవేక్షించామన్నారు. సింగూరు ప్రాజెక్టు ఎగువ నుంచి బోరంచ వరకు మంజీరా నది తీరం వెంబడి టూరిజంకు అనువైన స్థలాలను గుర్తిస్తున్నట్లు వారు తెలిపారు. టూరిజం అధికారుల వెంబడి పుల్‌కల్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, అంజయ్య, జీవన్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు

రూ.300 కోట్లతో అభివృద్ధి

- మంత్రి దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి(అందోల్): వైఎస్ఆర్ హయాంలోనే సింగూర్ జలాలను నియోజకవర్గంలోని 40 వేల ఎకరాలకు అందించడానికి కాల్వ నిర్మించామని, కాల్వల కోసం రూ.89.99 కోట్లు మంజూరు చేయించి, వాటి ద్వారా చెరువులను నింపామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం అందోలు మండల పరిధిలోని అన్నసాగర్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో మున్సిపాలిటీలోని కుల సంఘాలతో మంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సింగూర్ పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు, కాల్వల మరమ్మతులకు రూ.300 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. తాను ఏ శాఖ మంత్రిగా పదవి చేపట్టినా ఆ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులను చేశానని గుర్తు చేశారు. జేఎన్‌టీయూ, వ్యవసాయ, సాంకేతిక పాలిటెక్నిక్, పీజీ, డిగ్రీ కళాశాలలు వంటివి తీసుకొచ్చానన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశాఖ మంత్రిగా నర్సింగ్ కళాశాల, 150 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎస్.సురేందర్ గౌడ్, రంగ సురేశ్, ఆకుల చిట్టిబాబు, పీ.రేఖా ప్రవీణ్, డీ.శంకర్, నాగరాజ్, హరికృష్ణా గౌడ్, చందర్, దుర్గేశ్, మాజీ మార్కెట్ చెర్మన్ మల్లికార్జున్, వైశ్య సంఘం నాయకులు ప్రేమ్ కుమార్, రంగ హరి ప్రసాద్, సంపత్, రంగ రామకృష్ణ, శంకర్, పెండ్యాల రాములు, మాజీ ఎంపీటీసీ డీజీ.వెంకటేశంతోపాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన



గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అఖిలపక్షం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువలో అఖిలపక్షం, రైతులు నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామంటూ నిండుసభలో మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, కేటీఆర్ మాట్లాడిన తీరును వారు తప్పుబట్టారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయిందన్నారు. కుడి, ఎడమ కాలువలు పూర్తి కాకముందే ప్రాజెక్టు మొత్తం పూర్తి చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే కాలువల ద్వారా రైతులకు నీరేందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. ఏళ్లనాటి ఈ ప్రాంత రైతులు చిరకాల గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయకుండా 5, 6 ఏళ్ల కింద ప్రారంభించిన మల్లన్న సాగర్, రంగనాయక తదితర ప్రాజెక్టును పూర్తిచేసి గౌరవెల్లికి మొండిచేయి చూపించారని మండిపడ్డారు. ఇకనైనా ప్రాజెక్టును త్వరలో పూర్తిచేసి రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరేందుకు త్వరలో అఖిల పక్షం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిన్ని కలవబోతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, కేడం లింగమూర్తి, వీరన్నయాదవ్, జంగపల్లి అయిలయ్య, బంక చందు, గుడాటిపల్లి గ్రామ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, నాయకులు బైరగోని శ్రీనివాస్, గుగులోతు రాజునాయక్, బిక్యనాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మండలంలోని నర్సంపేట గ్రామానికి చెందిన పెరమాండ్ల రాములు కొద్ది రోజుల కిందట మృతి చెందాడు. అతడికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును మృతుడి కుమారుడు రాకేష్‌కు శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి మహమూద్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్త మరణిస్తే రూ.2 లక్షల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా మారిన వేళ



మాక్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థిని

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రజాప్రతినిధుల అవతారమెత్తారు. శనివారం మాక్ జెడ్పీ సమావేశం నిర్వహించి మేడారం జాతర-పర్యావరణం అంశంపై చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారుల పాత్రలను పలువురు పోషించారు. పాఠశాల టీచర్లు మోహన్, సంజీవ్‌కుమార్, మశ్చేందర్, రాజయ్య, మురళీగౌడ్, పీఈటీ సంగ్రామ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రెండు గ్రామాల్లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు, ముస్త్యాల గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకి పాల్పడిన సంఘటన శనివారం వెలుగుచూసింది. ఆకునూరు గ్రామానికి చెందిన రణం కిష్టయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. అలాగే ముస్త్యాల గ్రామానికి చెందిన సామల రామస్వామి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాడు. కిష్టయ్య శనివారం తిరిగి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారమిచ్చాడు. ముస్త్యాల గ్రామానికిచెందిన రామస్వామి ఇంటితలుపులు తెరిచి ఉండటం గమనించిన పొరుగింటి వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ దామోదర్ వివరణ కోరగా బాధితులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సైబర్ వలలో ప్రైవేటు ఉద్యోగులు

రూ.16.32 లక్షలను పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్ కు వచ్చిన వాట్సాప్ కు స్పందించి ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం... బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి.. పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ ఫిబ్రవరి 13న వచ్చింది. లింకు ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ తయారు చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి టాస్కులు చేయడం ప్రారంభించాడు. క్రమంగా తాను పెట్టిన నగదు, వాలెట్ కమీషన్ కలిపి మొత్తం రూ. 8.86 లక్షలను చూపిస్తున్నారు. తనకు అవసరమై తిరిగి చెల్లించాలని అడుగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం, అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. అలాగే.. సాయి భగవాన్ కాలనీకి చెందిన మరో ఓ ప్రైవేటు ఉద్యోగికి జనవరి 25న పార్ట్‌టైం జాబ్ పేరిట మెసేజ్ వస్తే లింకు తెరిచి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. అతను ముందుగా రూ.5 వేలు చెల్లించి టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. తాను పెట్టిన నగదును, వాలెట్ కమీషన్ మొత్తం 7.46 లక్షలు చూపిస్తూ వచ్చారు. అయితే ఉద్యోగి చివరిగా అంతా తిరిగి అవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులు దర్యాప్తులో ఉన్నాయి.

విద్యార్థులతో ఇంటి పనులు

కూలీలుగా మార్చిన హాస్టల్ వాచ్‌మెన్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ ఎస్టీ హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న నవీన్ పాపన్నపేట మండలం నార్సింగ్‌లో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. హాస్టల్‌లో ఉంటూ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద 9, 10వ తరగతి విద్యార్థులను కూలీలుగా మార్చాడు. ఎంతో కొంత డబ్బు, చిరుతిండ్ల ఆశచూపి నెల పదిహేను రోజులుగా ఇంటి పనులు చేయించుకుంటున్నాడు. నిత్యం ముగ్గురు, నలుగురు చొప్పున విద్యార్థులను పనులకు తీసుకువెళ్తున్నాడు. 15 రోజుల క్రితం హైస్కూల్ ఉపాధ్యాయులు హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రావడం లేదని ఆరా తీయగా పనులకు వెళ్తున్నట్లు తోటి విద్యార్థుల ద్వారా తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను హెచ్చరించారు. నిత్యం పాఠశాలకు రావాలని చెప్పారు. అయితే వాచ్‌మెన్ మాత్రం విద్యార్థులను పనులకు తీసుకువెళ్లాడు. ఈనెల 14వ తేదీన గృహప్రవేశం చేయగా నాలుగు రోజుల ముందు నుంచి సుమారు ఆరుగురు విద్యార్థులను అక్కడే ఉంచి పనులు చేయించుకున్నాడు. కూలీ పనులు ఎందుకు చేస్తున్నారు, ఎవరు చేయమన్నారని విద్యార్థులను ప్రశ్నిస్తే వాచ్‌మెన్ చేయించుకుంటున్నాడని చెప్పకనే చెప్తున్నారు. విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసి వాచ్‌మెన్, వార్డెన్‌పై మండిపడినట్లు తెలిసింది. ఇదే విషయమై హాస్టల్ వార్డెన్ విక్రం స్వామిని వివరణ కోరగా.. విషయం నాకు తెలియదని, విద్యార్థులతో మాట్లాడి వాస్తవమని తేలితే వాచ్‌మెన్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉద్యోగులు సంఘటితంగా ఉండాలి



టీఎన్‌జీఓ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్: ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం టీఎన్జీఓ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్నివర్గాల ఉద్యోగులు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ శాతం నమోదులో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అందుకు ఉద్యోగులే పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం టీఎన్జీఓ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరీమా

సిద్దిపేటరూరల్: గ్రామీణ నీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 16, 17 రెండు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని జిల్లాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య, తాగునీరు నిర్వహణలో ఉత్తమ పద్ధతులపై ఆయా రాష్ట్రాల నుంచి ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ మేరకు జిల్లాలో జరుగుతున్న ప్లాస్టిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా గ్రామాల్లో స్టీల్‌బ్యాంక్ కార్యక్రమాలను, జిల్లాలో జరుగుతున్న రుతుప్రేమ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ వివరించారు.

గోదావరి జలాలు విడుదల



గోదావరి జలాలను విడుదల చేస్తున్న ఈఈ జితేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీవాగులోకి గోదావరి జలాలు విడుదలయ్యాయి. శనివారం సాయంత్రం నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ జితేందర్‌రెడ్డి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అవుసులోనిపల్లి వద్ద సంగారెడ్డి కెనాల్ ఆఫ్‌టేక్ తూము గేట్లు ఎత్తి కొండపోచమ్మ హల్దీలోకి విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామన్నారు. కాగా ఇటీవల శాసనమండలిలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి యాసంగిలో పంటల సంరక్షణకు హల్దీలోకి గోదావరి జలాలు విడుదల చేయాలని కోరిన విషయం తెల్సిందే.

పంటల సాగులో సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



రైతులు సాగుచేసిన వరి పైరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

గజ్వేల్‌రూరల్: పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మండలం కోమటిబండతో పాటు ప్రజ్ఞాపూర్‌లో రైతులు సాగుచేసిన వరి పంట పొలాలను గజ్వేల్ ఏడీఏ బాబునాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో వరి పైరు పిలకదశలో ఉందని, మొగి పురుగుతో పాటు సల్ఫైడ్‌ధాతువు వల్ల నష్టపోతున్నటుల తెలిపారు. మొగి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరాంత్రనిలిప్రోల్ మందును లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లు కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని లేదా 4జీ కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 6కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. లేదా కారాడప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును లీటరు నీటికి 0.5మిల్లీ లీటర్లు కలిపి ఎకరాకు మొత్తం 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. అదే విధంగా సల్ఫైడ్ ధాతు వల్ల వరి వేర్లు కుళ్లి, పిలకలు మాడి ఎండిపోయిన లక్షణాలుంటాయన్నారు. దీని నివారణకు వరి పొలంలో నీటిని పూర్తిగా తొలగించి ఆరబెట్టాలని, తడి.. పొడి పద్ధతిలో నీటి తడులు వేసుకోవాలన్నారు. మల్లికే లేదా స్వర్ణపాల్ లేదా 19:19:19 ఎరువుల పోషకాలను పైపాటిగా పిచికారి చేయాలని, 15రోజుల తర్వాత పల్చగా ఎకరాకు 20కిలోల యూరియాను వేసుకోవాలని సూచించారు. అదే విధంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు ఇమామెక్టిన్ బెంజోయెట్ 200 లీటర్ల నీటికి 100 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతులు ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

కులగణన కల కాంగ్రెస్ నెరవేర్చింది

టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ



సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సూర్యవర్మ, దరిపల్లి చంద్రం

సిద్దిపేటకమాన్: బడుగు బలహీన వర్గాల ప్రజల కులగణన కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రవేశపెట్టిన కులగణన తీర్మానానికి శాసనసభ ఆమోదం తెలపడంతో సిద్దిపేటలో కాంగ్రెస్ ఓబీసీ సెల్, బీసీ నాయకులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపులే విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువత నైపుణ్యాన్ని వెలికి తీస్తాయి

జిల్లా సెషన్స్ జడ్జి రఘురాం



బహుమతులు అందిస్తున్న జడ్జి రఘురాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్రీడలు యువత నైపుణ్యాన్ని వెలికి తీస్తాయని జిల్లా సెషన్స్ జడ్జి రఘురాం, అడిషనల్ సెషన్స్ జడ్జి మురళీమోహన్, సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ అవగాహన సమావేశం, ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన వారోత్సవాల ముగింపు సమావేశం శనివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. యువజన ఉత్సవాల్లో భాగంగా స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి లవన్ కుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వివేక్ వర్ధన్, జిల్లా సంఘటన మంత్రి లక్ష్మీపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్, నగర కార్యదర్శి హరీష్, ఫణీందర్, కౌశిక్, లితిన్, తదితర విద్యార్థి పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళా బృందం

మెదక్ మున్సిపాలిటీ: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళా బృందం సభ్యులు విద్యార్థులకు సూచించారు. చేగుంట మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత నిబంధనలు, పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. తక్కువ ధరలో వస్తువులు ఇస్తామంటూ అనేక రకాలుగా మోసాలు జరుగుతాయని తెలిపారు. అపరిచిత వ్యక్తులు నుంచి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ సురేందర్, హోం గార్డ్స్, షీ టీం బృందం పాల్గొన్నారు.

మినహాయింపు ఇవ్వండి



మాట్లాడుతున్న పర్వతరెడ్డి

నారాయణఖేడ్: వయోభారం రీత్యా పలువురు ఉపాధ్యాయులకు పార్లమెంట్ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేడ్‌లో శనివారం జరిగిన యూనియన్ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరత నివారించేందుకు టీఆర్టీని నిర్వహించాలని కోరారు. బకాయి పడిన డీఏలను నాలుగు వాయిదాల్లో విడుదల చేయాలన్నారు. పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల, జీఓ 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టు త్వరగా తెప్పించి అమలు చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ సాబెర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్, రమణకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, హఫీజ్, జీవన్‌రాథోడ్, శివశంకర్ రాథోడ్, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, దేవీసింగ్, విజయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, షకీల్ అహ్మద్, సుందర్‌రావు, విజయ్‌కుమార్, ప్రకాష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.